క్లుప్తంగా

పింఛన్ అందజేత



శ్రీరామవరంలో అంధుడుకి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ కొత్తపల్లి వెంకటరమణ

దెందులూరు: ప్రభుత్వం పథకాల రూపంలో అందిస్తున్న ఆర్థిక సాయం, ప్రత్యేక అవసరాలు గల బాధితులకు, అంధులకు ఎంతో ఉపయోగపడుతోంది. శ్రీరామవరంలో అంధుడు తట్టుకూరి జోజికి మంజూరైన పెన్షన్ నగదును స్థానిక వలంటీర్ కొత్తపల్లి వెంకటరమణ ఇంటికి వెళ్లి అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్ నగదును కుటుంబ సభ్యుల మాదిరిగా ఇంటికి వచ్చి ఇవ్వడం వల్ల జీవనానికి కొంత మేలు జరుగుతోందని లబ్ధిదారుడు వలంటీర్‌ను అభినందించారు.

'స్పందన' రద్దు

దెందులూరు: దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమం రద్దు చేసినట్టు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలోని కుక్కునూరు పర్యటన, వరద సహాయక చర్యల పరిశీలనకు వస్తున్న సందర్భంగా స్పందన కార్యక్రమం రద్దు చేసినట్టు తెలిపారు. మండల ప్రజలు స్పందన రద్దు విషయాన్ని గమనించాలని తహసీల్దార్ కోరారు.

ట్రాలీలోకి దూసుకెళ్లిన కారు

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు మండలం కొవ్వలి సమీపంలో ఆదివారం రాత్రి ఏలూరు వైపు వెళుతున్న లారీ ట్రాలీని వెనుక నుంచి వస్తున్న కారు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. కారులోని వ్యక్తులు కృష్ణా జిల్లాకు చెందిన వారని సమాచారం. విషయం తెలుసుకున్న దెందులూరు పోలీసులు బాధితులను ఏలూరు వైద్యశాలకు తీసుకెళ్లారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



సాంబశివ ప్రసాద్

భీమడోలు: లిక్సిల్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న భీమడోలుకు చెందిన గిరిజాల సాంబశివప్రసాద్ అనే యువకుడు గత నాలుగు రోజులుగా కనిపించడం లేదని అతని తండ్రి ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. సాంబశివప్రసాద్ ఈ నెల 2న రాత్రి విధుల నిమిత్తం వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పి బయటకు వెళ్లాడు. మరుసటి రోజు విధులను ముగించుకుని ఇంటికి రావాల్సి ఉండగా ఇంటికి రాకపోవడంతో ఆందోళనతో కుటుంబ సభ్యులు బంధువులు, పరిసరాల గ్రామాల్లో సాంబశివ ప్రసాద్ ఆచూకీ కోసం గాలించారు. ఎంతకీ దొరకకపోవడంతో తండ్రి భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు హెచ్‌సీ డి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

భీమడోలు: మండలంలోని సూరప్పగూడెంలో బహిరంగప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం భీమడోలు పోలీసులు దాడి చేశారు. ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3440 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్సై సురేష్‌కుమార్ తెలిపారు.

వార్డు ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఉంగుటూరు: ఉంగుటూరు, కాకర్లమూడి గ్రామాల్లో వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉంగుటూరులోని పదో వార్డుతో పాటు కాకర్లమూడిలో 1,5 వార్డులకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఉంగుటూరులో వార్డు సభ్యురాలు కాళ్ల లక్ష్మీ గౌరి మరణంతో, కాకర్లమూడిలో వార్డు సభ్యుల రాజీనామాల కారణంగా ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఆయా వార్డులకు నామినేషన్ల ప్రక్రియ 8 నుంచి 10వ తేదీ వరకూ ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొంది.

సాగునీరు అందించాలి

ఏలూరు రూరల్: ఏలూరు మండలం జాలిపూడి శివారు పంట చేలకు తక్షణం అధికారులు సాగునీరు అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ కోరారు. ఆదివారం సంఘం నాయకులు బైరెడ్డి లక్ష్మణరావు, తిరుపతి రంగారావు, తోట రాంబాబు, బల్లవరపు రాంబాబు, నందివాడ శ్రీనివాసరావు, ఇంటి పెద్దిరాజు, కూడవల్లి భవానితో కలిసి జాలిపూడిలో సాగునీరు అందని పంటచేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా శివారు ప్రాంతంలో పాత జాలిపూడి కాలువ అనేక చోట్ల ఆక్రమణకు గురవడంతో శివారు ప్రాంతాల్లోని 1,200 ఎకరాలకు సాగునీరు అందడం లేదని ఆయన అన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- రూ.10 కోట్లతో ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం
- 660 క్యూబిక్ లీటర్ల తాగునీటి నిల్వ సామర్థ్యం
- ఇరవై ఏళ్లకు సరిపడా అవసరాలకు తగిన ఏర్పాట్లు



గుడివాకలంక ప్రధాన రోడ్డు పక్కన వేస్తున్న పైప్‌లైన్ (ఫైల్)



చాటపర్రులో ఫిల్టర్‌బెడ్లకు మరమ్మతులు చేస్తున్న కూలీలు



మల్కాపురంలో కొత్తగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్



మాదేపల్లిలో నిర్మించిన తాగునీటి సాంపు, ట్యాంక్

ఏలూరు రూరల్: గత ప్రభుత్వ హయాంలో ఏలూరు మండలం దెందులూరు నియోజకవర్గ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండేది. వేసవికాలంలో గ్రామీణ ప్రజలు తాగునీటి కోసం గగ్గోల పెట్టేవారు. ట్యాంకులు, పబ్లిక్ కుళాయి వద్ద బారులు తీరేవారు. ఉన్నత వర్గం ప్రజలు మోటార్లు వేయడం వల్ల మా కుళాయిల నుంచి తాగునీరు రావడం లేదని అనేక మంది ఫిర్యాదు చేసేవారు. కాని నేడు పరిస్థితి పూర్తిగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ సమస్యకు శాస్వత పరిష్కారం చూపింది. మరో ఇరవై ఏళ్ల వరకూ పెరుగుతున్న జనాభాకు సరిపడా మౌలిక వసతులు ఏర్పాటు చేసారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దెందులూరు నియోజకవర్గంలోని 15 గ్రామ పంచాయతీ పరిధిలో రూ.10 కోట్ల రూర్బన్ పథకం నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకులు, మైక్రో ఫిల్టర్లు, ఫిల్టర్ బెడ్లు, కొత్త తాగునీటి పైప్‌లైన్, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భవిషత్తులో సైతం తాగునీరు సమస్య ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో వసతులు అందుబాటులోకి తెచ్చారు.

భవిష్యత్తు అవసరాలకోసం భగీరథ ప్రయత్నం

ప్రజల అవసరాలను గుర్తించి ఒక్కొక్క గ్రామంలో 40 కిలోలీటర్ల సామర్థ్యం కల్గిన ట్యాంకుల నుంచి 200 లీటర్ల సామర్థ్యం కల్గిన భారీ ట్యాంకులు నిర్మించారు. గ్రామ శివారున నివసిస్తున్న పేదలకు సైతం తాగునీరు పుష్కలంగా అందేలా ఒక్కొక్కటి ట్యాంక్ 10 నుంచి 12 అంతస్తుల ఎత్తులో నిర్మించారు. ఉన్నత వర్గాల ప్రజలు మోటార్లు వేసినా మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం తాగునీరు పుష్కలంగా అందేలా గ్రావిటీ సృష్టించారు. మాదేపల్లిలో రూ.80 లక్షలతో పూర్తి చేసిన 200 లీటర్ల సామర్థ్యం కల్గిన ట్యాంకు అతి పెద్దది. చాటపర్రులో 1.03 కోట్లతో, మల్కాపురంలో రూ.40 లక్షలతో 90 కేఎల్ సామర్థ్యం గల ట్యాంకులు రెండు నిర్మించారు. ఇదే క్రమంలో శ్రీపర్రు, గుడివాకలంక 60 కేఎల్ ట్యాంకులు రెండు ట్యాంకులు నిర్మించారు. మరోపక్క మహేశ్వరపురం, తిమ్మారావుగూడెం, కలకుర్రులో రూ.44 లక్షల చొప్పున వెచ్చించి మరో మూడు ట్యాంకులతో పాటు పైప్‌లైన్ సైతం ఏర్పాటు చేస్తున్నారు. చాటపర్రు, కాట్లంపూడి, కోటేశ్వరదుర్గాపురంలో మరో మూడు 40 కేఎల్ సామర్థ్యం గల ట్యాంకులు పూర్తి చేసారు. సుమారు రూ.2.37కోట్లతో ప్రత్తికోళ్లలంక, మాదేపల్లి, కోటేశ్వరదుర్గాపురంలో సీపీడబ్ల్యూఎస్ ట్యాంకు నుంచి కొత్త పైప్‌లైన్ వేసారు. ఇటీవల కొత్తగా గుడివాకలంక కొత్త చెరువు నుంచి గ్రామంలో తాగునీటి చెరువు వరకూ రూ.20 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులతో కొత్త పైప్‌లైన్ వేసారు. దీనికి తోడు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు సుమారు రూ.14 లక్షల మండల పరిషత్ నిధులు మంజూరు చేసి చాటపర్రు, మాదేపల్లి, శ్రీపర్రులో ఫిల్టర్‌బెడ్లకు మరమ్మతులు చేయించారు. మొత్తంగా 660 క్యూబిక్ లీటర్ల సామర్థ్యం కల్గిన 11 ట్యాంకులతో పాటు పదుల కిలోమీటర్ల విస్తీర్ణంలో పైప్‌లైన్ వేసారు. తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు భగీరథ ప్రయత్నం చేయడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా పనులు పూర్తి



తాగునీటి మౌలిక వసతుల ఏర్పాటులో నియోజకవర్గ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి ఎంతో ఉంది. రూర్బన్ నిధులతో పాటు, జలజీవన్ మిషన్ నిధులతో ప్రతి గ్రామాల్లో పాత పైప్‌లైన్ స్థానే కొత్త పైప్‌లైన్ వేయించారు. అధికారులు, కాంట్రాక్టర్లకు నమ్మకం కల్గించి పనులు వేగంగా పూర్తి చేయించారు. ఇప్పుడే కాదు మరో 20 ఏళ్ల వరకూ ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ట్యాంకుల నిర్మాణం చేపట్టడం విశేషం.

– పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

మరచిపోలేని అభివృద్ధి పనులు



ఎన్నోఏళ్లగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్యను ప్రభుత్వం పరిష్కరించినందుకు చాలా సంతోషంగా ఉంది. మాదవాపురంలో రూ.25 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. ఇందిరమ్మకాలనీ, మాదవాపురంలో రూ.2 లక్షలతో కొత్త పైప్‌లైన్ వేసారు. మరో రూ.4 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులతో వాటర్‌ప్లాంట్ నిర్మించారు. మొత్తంగా తాగునీటి సమస్యలు పరిష్కారమయ్యాయి.

– వట్రీ నారాయణరావు, వైఎస్సార్ సీపీ లీడర్, కేడీపురం

రాష్ట్ర వ్యాప్తంగా అల్లర్లు సృష్టించడమే చంద్రబాబు లక్ష్యం

- శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా కుట్ర
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు : రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, అల్లర్లు సృష్టించడం చంద్రబాబు లక్ష్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరులో పోలీసులు అనుమతి ఇచ్చిన మార్గాన్ని వదిలి టౌన్‌లోకి వెళ్లడం ద్వారా కావాలనే అల్లర్లు సృష్టించి టీడీపీ శ్రేణులను ప్రేరేపించి రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిందెవరని ప్రశ్నించారు. చంద్రబాబు కుట్ర కారణంగా సుమారు 51 మంది పోలీసులకు తీవ్రంగా రక్తగాయాలయ్యారని అన్నారు. ఈ ఘటనలో పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. చంద్రబాబు పర్యటిస్తే టీడీపీ నేతల కారుల్లో మారణాయుధాలు ఎందుకున్నాయో సమాధానం చెప్పాలన్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసి అల్లర్లకు కారణమయ్యారని అన్నారు. పోలీసులపై దాడి చేస్తే వారు ఆత్మరక్షణార్థం పోలీసులు ఫైరింగ్ చేస్తే కాల్పుల్లో ఎవరైనా చనిపోతే శవరాజకీయం చేయడానికి కుట్ర చేశావా అని చంద్రబాబును ఎమ్మెల్యే కొఠారు ప్రశ్నించారు. చంద్రబాబు పర్యటనలకు ప్రజా స్పందన లేకపోవడంతో ప్రజల దృష్టి మరల్చేందుకు నీచానికి దిగజారగడం దుర్మార్గమన్నారు. పోలవరంలో పర్యటిస్తానని, చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. పోలవరం నిర్మాణం చంద్రబాబుకు ఏటీఎంలా మారిందని, ప్రధాని నరేంద్రమోదీ అన్న విషయం వాస్తవం కాదా ప్రశ్నించారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయభేరి మోగించడం తథ్యమన్నారు. దెందులూరు నియోజకవర్గంలో రౌడీషీటర్ చింతమనేని పుంగనూరు సమస్యపై విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అతనిపై ఉన్న కేసులు ప్రజలందరికీ తెలుసునన్నారు. చింతమనేనిని దెందులూరు నియోజకవర్గ ప్రజలు ఎప్పుడో మరిచిపోయారని ఎమ్మెల్యే కొఠారు అన్నారు. దెందులూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన మంత్రంగా పనిచేస్తున్నామని వచ్చే ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా మరోసారి రెపరెపలాడటం తథ్యమన్నారు.

మణిపూర్ ఘటనలు అత్యంత ప్రమాదకరం



గుండుగొలనులోని అంబేడ్కర్ సెంటర్ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

భీమడోలు: మణిపూర్ రాష్ట్రంలో జరిగిన అమానవీయ ఘటన దేశ ప్రజలకు అత్యంత ప్రమాదకరమైన సంకేతమని, మానవతావాదులంతా ఉద్యమించాలని సీఎస్ఐ ఫాదర్ రెవరెండ్ కనిగంటి ఇశ్రాయేలు అన్నారు. గుండుగొలనులో సీఎస్ఐ, ఆర్సీఎం, బెతెస్థ తదితర క్రైస్తవ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులను చేతపట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఇశ్రాయేలు, పాస్టర్ మోషే, కె.శ్యామ్‌కుమార్‌లు మణిపూర్ మారణహోమాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ విషయాన్ని మానవదృక్పథంతో చూడాలని కోరారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు చేబత్తిన అనిల్‌కుమార్, కడిమే బాలస్వామి, కోండాబత్తుల మహంకాళి, దొండపాటి నవమణి రాజు, పెయ్యిల ప్రకాశం, జంగం రాజేంద్రకుమార్, కడిమే వసంతకుమార్, కాలి జాన్, వాసే తిరుపతిరావు, లింగాల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభ్యున్నతికి శశిధర్ రెడ్డి విశేష కృషి



శశిధర్‌రెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని

ఏలూరు టౌన్: న్యాయవాద వృత్తిని అంకితభావంతో నిర్వర్తిస్తూ, సమాజ అభ్యున్నతికి విశేష కృషి చేసిన తేతలి శశిధర్ రెడ్డి అకాల మృతి చెందడం బాధాకరమని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని తన ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. ఏలూరులోని ఆయన స్వగృహం వద్ద శశిధర్ రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమారుడు, బంధువులను ఆయన పరామర్శించి ధైర్యంగా ఉండాలని కోరారు. మీ కుటుంబానికి మేమంతా ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రముఖ న్యాయవాదిగా, పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, ఏలూరు బార్ అసొసియేషన్ మాజీ అధ్యక్షుడిగా, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శిగా తేతలి శశిధర్‌రెడ్డి విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన ఆకస్మిక మృతి అందరినీ కలచి వేసిందన్నారు. కుటుంబ సభ్యులకు, బంధువులకు భగవంతుడు మనోస్థైర్యాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, ప్రముఖ న్యాయవాది దొంగ రామాంజనేయులు, పీపీ ఆచంట వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ నాయకులు గుడూరి విజయప్రసాద్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

'ఆపదలో అండగా ఉంటా'

పెదవేగి: ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం రాత్రి సుమారు 12 కుటుంబాలను, అనారోగ్యం మంచాన పడి చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించి అండగా ఉన్నామని భరోసా కల్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వాసె జాన్‌ఏదిద్య, దొడ్డిగర్ల ఆజ్జేసమ్మ, దాసరి సునీల్, నేతల ప్రసాద్, దోమతోటి ఆదాం, కాట్రు ధర్మయ్య, కొనకళ్ళ శ్రీనివాసరావు, బొర్రా కృష్ణ, చిరుగుపల్లి వెంకన్నను పరామర్శించారు. అనంతరం వేముల రాజ్‌కుమార్, పంది సీతమ్మ, బాలిన ముసలయ్య మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నం

ఏలూరు టౌన్: దెందులూరు మండలం కొమరేపల్లికి చెందిన కొరపాటి నాగయ్య (35)కు భార్య ఝాన్సీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగయ్య వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన కాలే శ్రీను, అతని భార్య ఎస్తేరు రాణి వేధించడంతో నాగయ్య, ఝాన్సీ ఇంటివద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. వీరిద్దరూ తీవ్ర అస్వస్థతకు గురవడంతో బంధువులు ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించారు. దీనిపై వైద్యులు హాస్పిటల్ అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారంఅందించారు.

ఇద్దరు లారీ డ్రైవర్ల మధ్య ఘర్షణ

ఏలూరు టౌన్: మద్యం మత్తులో ఇద్దరు లారీ డ్రైవర్లు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఏలూరు తూర్పువీధికి చెందిన వీర్ల కృష్ణ (42)కు భార్య, కుమా రుడు, కుమార్తె ఉన్నారు. అతని స్నేహితుడైన చాటపర్రుకు చెందిన లారీడ్రైవర్ అన్నవరంతో కలిసి ఏలూరు తంగెళ్ళమూడిలోని ఒక బార్ వద్ద మద్యం తాగారు. ఇద్దరి మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. అన్నవరం చేతితో గట్టిగా కృష్ణను చెవిపై కొట్టడంతో రక్తస్రావమైంది. చెవివద్ద రక్తనాళానికి గాయమైందని వైద్యు లు తెలిపారు. ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై వీ.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'



చిన్నారులకు నీతి కథలను వివరిస్తున్న మండే సుధాకర్



పెదవేగిలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం ఉల్లాసభరిత వాతావరణంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన చిన్నారులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేశారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంధపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులు సామూహిక పుస్తక పఠనం చేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పాల్గొని చిన్నారులకు స్నేహితుల దినోత్సవ విలువలను చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు కడగల సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

పెదవేగి : గ్రంథాలయాలతో విజ్ఞాన భాండారాలని నిత్యం గ్రంథ పఠనంతో మేధాశక్తి పెంపొందించుకోవచ్చని పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖ గ్రంథాలయంలో ఆదివారం సమీప గ్రామాలకు చెందిన విద్యార్థులతో చదవడం- మా కిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిత్యం పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను అరుణ్‌కుమార్ వివరించారు.

గద్దర్‌కు నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ నేతలు

పెదవేగి : ప్రజా యుద్ధ నౌక, దళిత గిరిజన ప్రజల తరఫున తన పాట ద్వారా చైతన్య పరిచి తను కూడా ప్రత్యక్ష ఉద్యమానికి నాయకత్వం వహించిన ఓ ధ్రువ తార నేల రాలిందని ఎమ్మార్పీఎస్ నేత యర్రా నాగమల్లేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గద్దరన్న ఆకస్మిక మృతికి చింతిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు యర్రా నాగమల్లేశ్వరరావు పెదవేగిలో ఆదివారం శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు.

పుంగనూరు ఘటనకు ముఖ్య కారకుడు చంద్రబాబే

భీమడోలు: పుంగనూరు గొడవకు ముఖ్య కారకుడు కర్మ, కర్త క్రియ అన్నీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబేనని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పోలీసు వ్యవస్థపైనే రౌడీయిజంచేసి పోలీస్‌వ్యవస్థను దెబ్బతీయాలని రౌడీ ముకలను రెచ్చకొట్టి 50 మంది పోలీసులకు గాయాలు కావడానికి ప్రధా న కారకుడైన చంద్రబాబుపై ఏ1గాచేర్చి కేసు నమోదు చేయాలని డిమాండ్‌చేశారు. ఓటమి భయంతోనే టీడీపీ రౌడీమూకలను రెచ్చగొట్టి గొడవ లు, దాడులకు తెగబడుతుందని మండిపడ్డారు.

సచివాలయ సేవలు భేష్

- అందుబాటులో 530 సేవలు
- సంతృప్తి చెందుతున్న ప్రజలు
- ప్రభుత్వంపై ప్రశంసల వెల్లువ



సేవలందిస్తున్న డిజిటల్ అసిస్టెంట్

పెదవేగి: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనను నేడు రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రెండు వేల జనాభాకు ఒక్కో గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే సేవలను అందిస్తున్నారు. గ్రామ సచివాలయ ఏర్పాటు తొలినాళ్లలో కొన్ని సేవలకే పరిమితమైన సిబ్బంది ప్రస్తుతం వందలాది సేవలను అందించడంపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. దెందులూరు నియోజకవర్గంలో ని నాలుగు మండలాల్లో 81 గ్రామ సచివాలయాలు ఉండగా సుమారు 725మంది ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు ప్రయోజనకారులుగా ఉంటున్నారు. మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా గ్రామ సచివాలయాల్లోనే సేవలను అందిస్తూ కక్షిదారులకు శ్రమ, సమయాన్ని ఆదా చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం అవసరమైన సేవలన్నీ అందుబాటులో ఉండటంతో పాటు నెలరోజుల వ్యవధిలోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటికే చేరుతుండటంవల్ల గ్రామీ ణ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

సచివాలయానికి వస్తే క్షణాల్లో పని పూర్తి

గ్రామ సచివాలయానికి పని మీద వస్తే సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లు క్షణాలమీద పని పూర్తి చేస్తు న్నారు. నాడు టీడీపీ పాలనలో గ్రామ పంచాయతీ కార్యాలయానికి వస్తే సమాధానం చెప్పే పరిస్థితి ఉండేది కాదు. నేడు సచివాలయానికి వచ్చిన ప్రజలకు సిబ్బంది సంతప్తికరమైన సమాధానం చెప్పడంతో పాటు అడిగిన పని ఎంత గడువులో పూర్తవుతుందో చెబుతున్నారు. ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం గతంలో అందించే సేవలతో పాటు కొత్తగా మీసేవ కేంద్రాల ద్వారా అందించే సేవలను కూడా అందిస్తోంది. ఇప్పటి వరకూ పరిమిత సంఖ్యకే పరి మితమైన సేవలు ప్రస్తుతం 580 వరకూ పెంచింది. గ్రామ సచివాలయాల్లో ప్రస్తుతం నాన్ మీసేవ సేవలు 388 కాగా మీ సేవ కేంద్రాల ద్వారా అందించే సేవలు 144 ఉన్నాయి.

డిజిటల్ సేవల్లో సరికొత్త అధ్యాయం

గ్రామ సచివాలయ ఏర్పాటు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ సేవల్లో సరికొత్త అధ్యాయం నెలకొల్పింది. సగటు జీవి జీవనోపాధికి అవసరమైన రేషన్ కార్డు, పింఛన్ అర్హులైన వారికి పది రోజుల్లోనే మంజూరు చేస్తున్నారు. కుల, ఆదాయ, కౌలురైతు సాగుహక్కు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు నిర్ణీత సమయంలో మంజూరు చేస్తున్నారు. ఇసుక బుకింగ్ సేవలు కూడా పైసా ఖర్చు లేకుండా గ్రామ సచివాలయా ల్లోనే అందిస్తున్నారు. రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించుకోవచ్చు. ఇంకా అనేక సేవలు ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండటంపై ప్రజల్లో ప్రభుత్వానికి మరింత ఆదరణ పెరుగుతోంది.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముంగిటకే సేవలను అందిస్తూ సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. సిబ్బంది నుంచి అవసరమైన సమాచారాన్ని తీసుకోండి.

– జి రాజ్‌మనోజ్ ఎంపీడీవో పెదవేగి

విస్తృత సేవలు అందిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి రోజు గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది.

– బోయిన శామ్యూల్ సుమంత్, డిజిటల్ అసిస్టెంట్, విజయరాయి